విస్తృత అవకాశాలకు.. ప్లాస్టిక్ డిప్లొమాలు

తక్కువ ధరకు తయారవడం, తేలికగా ఉండటం, మన్నికతోపాటు సౌకర్యవంతం.. తదితర కారణాలతో ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్‌కు ఆదరణ పెరుగుతోంది. దీన్ని మరింత మెరుగ్గా రూపొందించి, వినియోగంలోకి తేవడానికి నిపుణుల సేవలే కీలకం. ఇందుకోసం ప్రత్యేకంగా సంస్థలూ వెలిశాయి. వాటిలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) ముఖ్యమైంది. ఇది హైదరాబాద్, విజయవాడ సహా దేశవ్యాప్తంగా కోర్సులు అందిస్తోంది. వాటిలో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది.

ఎందులోనైనా సులువుగా ఇమిడిపోయి, కోరుకున్న రూపాన్ని సంతరించుకోవడం ప్లాస్టిక్ ప్రత్యేకత. అన్ని విధాలుగానూ ప్రయోజనకరంగా ఉండటంతో పరిశ్రమలు పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ వినియోగిస్తున్నాయి. అలాగే ఉత్పత్తీ చేస్తున్నాయి. ఇందుకోసం ఈ విభాగంలో నైపుణ్యమున్నవారిని ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి. ప్లాస్టిక్, అనుబంధ విభాగాల్లో సమర్థులైన మానవ వనరులను పరిశ్రమలకు అందించే లక్ష్యంతో కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చెన్నైలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) ఏర్పాటైంది. గతంలో దీన్ని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్)గా వ్యవహరించేవారు.

ఈ సంస్థకు అనుబంధంగా దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రాల్లో డిప్లొమా, పోస్టు డిప్లొమా, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు అందిస్తున్నారు. పరీక్షలో చూపిన ప్రతిభతో వీటిలో ప్రవేశం లభిస్తుంది. వీటిని పూర్తిచేసుకున్న వారు ప్రాంగణ నియామకాల్లో మేటి సంస్థల్లో ఉద్యోగాలు సొంతం చేసుకుంటున్నారు. ఓఎన్‌జీసీ, ఓల్టాస్, మిల్టన్, సెలో, ఎల్‌అండ్‌టీ, మారుతీ సుజుకీ, రిలయన్స్, ఐఎఫ్‌బీ, బీపీఎల్, హెచ్‌సీఎల్, ఏషియన్ పెయింట్స్, బటర్‌ఫ్లై, టాటా...తదితర సంస్థలు వీరిని ఎంపిక చేసుకుంటున్నాయి. ఆటోమోటివ్, ప్యాకేజింగ్, కన్జూమర్ గూడ్స్, మెషీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఆర్ అండ్ డీ.. తదితర విభాగాలకు చెందిన సంస్థలకు ప్లాస్టిక్‌పై పట్టున్నవారి సేవలు కీలకం. అందువల్ల ఈ కోర్సులు చదివినవారి ఉపాధికి ఢోకా లేదు. కొంత అనుభవంతో మెరుగైన వేతనాలు పొందవచ్చు. అలాగే సొంతంగానూ చిన్న పరిశ్రమను నెలకొల్పవచ్చు.

డిప్లొమా, పోస్టు డిప్లొమా, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులను దేశవ్యాప్తంగా 28 సిపెట్ కేంద్రాల్లో అందిస్తున్నారు. ఈ సంస్థకు హైదరాబాద్, విజయవాడల్లో క్యాంపస్‌లు ఉన్నాయి. వీటితోపాటు.. అహ్మదాబాద్, అమృత్‌సర్, ఔరంగాబాద్, బడ్డీ, బాలాసోర్, భోపాల్, భువనేశ్వర్, చంద్రపూర్, చెన్నై, దేహ్రాదూన్, వారణాసి, గువాహాటి, హాజీపూర్, హల్దియా, ఇంఫాల్, జయపూర్, కోచి, లఖ్‌నవూ, మధురై, ముర్థల్, మైసూరు, రాయ్‌పూర్, రాంచీ, కోర్బ, అగర్తల, గ్వాలియర్ కేంద్రాల్లో కోర్సులు చదువుకోవచ్చు.

డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ)

వ్యవధి: మూడేళ్లు (6 సెమిస్టర్లు)
అర్హత: పదో తరగతి/ సమాన స్థాయి ఉత్తీర్ణత. ప్రస్తుతం పరీక్షలకు సిద్ధమవుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.
పరీక్షలో: జనరల్ నాలెడ్జ్ 50, సైన్స్ 40, ఇంగ్లిష్ 10 ప్రశ్నలు వస్తాయి.

డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ)

వ్యవధి: మూడేళ్లు (6 సెమిస్టర్లు)
అర్హత: పదో తరగతి/ సమాన స్థాయి ఉత్తీర్ణత. ప్రస్తుతం పరీక్షలకు సిద్ధమవుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.
పరీక్షలో: జనరల్ నాలెడ్జ్ 50, సైన్స్ 40, ఇంగ్లిష్ 10 ప్రశ్నలు వస్తాయి.

పోస్టు డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/క్యామ్ (పీడీ-పీఎండీ)

వ్యవధి: 18 నెలలు (3 సెమిస్టర్లు)
అర్హత: మెకానికల్/ ప్లాస్టిక్ టెక్నాలజీ/ టూల్/ ప్రొడక్షన్/ ఆటోమొబైల్/ మెకట్రానిక్స్/ టూల్ డై అండ్ మేకింగ్/ సిపెట్ నుంచి డీపీఎంటీ/ డీపీటీ వీటిలో ఎందులోనైనా మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణత. ప్రస్తుతం చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారూ అర్హులే.
పరీక్షలో: జనరల్ నాలెడ్జ్ 40, సైన్స్ 20, ఇంగ్లిష్ 20, సంబంధిత డిప్లొమా నుంచి 20 ప్రశ్నలు వస్తాయి.

పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ-పీపీటీ)

వ్యవధి: రెండేళ్లు (4 సెమిస్టర్లు)
అర్హత: ఏదైనా సైన్స్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారూ అర్హులే.
పరీక్షలో: జనరల్ నాలెడ్జ్ 40, సైన్స్ 20, ఇంగ్లిష్ 20, బీఎస్సీ స్థాయి కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ, మ్యాథ్స్ 20 ప్రశ్నలు వస్తాయి.

పై కోర్సులన్నీ హైదరాబాద్ క్యాంపస్‌లో అందిస్తున్నారు. పీడీ–పీఎండీ తప్ప మిగిలినవి విజయవాడ క్యాంపస్‌లో ఉన్నాయి. గరిష్ఠ వయసు నిబంధన లేదు.

ఆన్‌లైన్ పరీక్ష

ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. దీని వ్యవధి 60 నిమిషాలు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలోనే ఉంటాయి. మొత్తం వంద ప్రశ్నలు వస్తాయి. రుణాత్మక మార్కులు లేవు. మాదిరి ప్రశ్నపత్రాలు సిపెట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. జనరల్ నాలెడ్జ్ విభాగంలో స్పోర్ట్స్, హిస్టరీ, పాలిటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, కరెంట్ అఫైర్స్ ప్రశ్నలు వస్తాయి. మూడేళ్ల డిప్లొమా కోర్సుల్లో సైన్స్, ఇంగ్లిష్ ప్రశ్నలు పదో తరగతి సిలబస్ స్థాయిలోనే ఉంటాయి. అందువల్ల పాఠ్యపుస్తకాలు బాగా చదువుకున్నవారు ఎక్కువ మార్కులు పొందవచ్చు. సిపెట్ వెబ్‌సైట్‌లో మాదిరి ప్రశ్నలు పరిశీలించి, ప్రశ్నాంశాలపై అవగాహన పెంచుకోవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తులు: మే 28 వరకు స్వీకరిస్తారు.
పరీక్ష ఫీజు: ఎస్సీ, ఎస్టీలకు రూ.250. ఓబీసీ, జనరల్ అభ్యర్థులకు రూ.500.
పరీక్ష తేదీ: జూన్ 11
వెబ్‌సైట్: https://www.cipet.gov.in/

కొవిడ్ తర్వాత కోలుకుని, విస్తరిస్తోన్న రంగాల్లో పర్యాటకం ఒకటి. పర్యాటక సంస్థల నిర్వహణ, అభివృద్ధిలో సమర్థ మేనేజర్ల సేవలే కీలకం. ఈ రంగంలో రాణించాలనుకునేవారికోసం కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ (ఐఐటీటీఎం)లు నెలకొల్పారు. ఈ సంస్థల్లో బీబీఏ, ఎంబీఏ కోర్సులను నెల్లూరుతో సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంగణాల్లో అందిస్తున్నారు. వీటిలో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది!

పర్యాటకంలో సేవలందిస్తారా?

పర్యాటక రంగంలో సేవల నిమిత్తం సుశిక్షితులైన మానవ వనరులను అందించడానికి మన దేశంలో జాతీయ ప్రాధాన్య సంస్థలుగా నెల్లూరు, గ్వాలియర్, భువనేశ్వర్, నోయిడాల్లో ఐఐటీటీఎంలను ఏర్పాటు చేశారు. వీటిలో బీబీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశం.. పరీక్ష, బృంద చర్చ, మౌఖిక పరీక్షలతో లభిస్తుంది. ఈ కోర్సులను ఇందిరా గాంధీ జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం, అమరాంతక్ పర్యవేక్షణలో బోధిస్తున్నారు. వివిధ వర్గాలకు చెందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందుతున్నాయి.

ఇక్కడ కోర్సులు పూర్తిచేసుకున్నవారు ప్రభుత్వ, ప్రైవేటు పర్యాటక సంస్థలు; రిసార్టులు, క్యాటరింగ్ సంస్థలు, విమాన యాన సంస్థలు, హోటళ్లు, ఆతిథ్యంతో ముడిపడే ఇతర విభాగాల్లో అవకాశాలు పొందుతున్నారు. ఇక్కడి విద్యార్థులను క్యాంపస్ నియామకాల ద్వారా మేక్ మై ట్రిప్, యాత్రా, ఐఆర్‌సీటీసీ, మారియట్, షెరటాన్, బామర్ లారీ, హాలిడే ఇన్, జెట్ ఎయిర్‌వేస్, హ్యాపీటూర్...తదితర సంస్థలు ఎంపిక చేసుకుంటున్నాయి. ఈ సంస్థల్లో మూడేళ్లకు కలిపి బీబీఏ ఫీజు సుమారు రూ.2.80 లక్షలు. ఎంబీఏ రెండేళ్లకు రూ.3.40 లక్షలు అవుతుంది. ఫీజుల నిమిత్తం బ్యాంకుల ద్వారా రుణసౌకర్యం పొందవచ్చు.



ఎంబీఏ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్

సీట్లు: మొత్తం 750. వీటిలో గ్వాలియర్‌లో 334, భువనేశ్వర్‌లో 112, నోయిడా 189, నెల్లూరు 75, గోవాలో 40 చొప్పున ఉన్నాయి.
అర్హత: ఏదైనా డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీలైతే 45 శాతం సరిపోతుంది. ప్రస్తుతం ఆఖరు సంవత్సరం డిగ్రీ కోర్సుల్లో ఉన్నవాళ్లూ దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు: జులై 1, 2023 నాటికి 27 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్ల మినహాయింపు వర్తిస్తుంది.
ఎంపిక: ప్రవేశ పరీక్ష, బృందచర్చ, మౌఖిక పరీక్షలో చూపిన ప్రతిభతో కోర్సులోకి తీసుకుంటారు. పరీక్షకు 70 శాతం, గ్రూప్ డిస్కుషన్‌కు 15, ఇంటర్వ్యూకు 15 శాతం వెయిటేజీ ఉంటుంది. మ్యాట్, క్యాట్, సీమ్యాట్, జాట్, జీమ్యాట్, ఆత్మా వీటిలో ఏదో ఒక పరీక్షలో స్కోరు సాధించినవారికి ప్రవేశ పరీక్ష నుంచి మినహాయింపు లభిస్తుంది. ఇవేవీ లేనివారు ఐఐటీటీఎం నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరవ్వాలి.

బీబీఏ టూరిజం అండ్ ట్రావెల్

సీట్లు: అన్ని క్యాంపస్‌ల్లోనూ కలిపి మొత్తం 375 ఉన్నాయి. వీటిలో గ్వాలియర్ 112, భువనేశ్వర్ 75, నోయిడా 113, నెల్లూరుకు 75 కేటాయించారు.
అర్హత: 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీలైతే 45 శాతం. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం కోర్సుల్లో ఉన్నవాళ్లూ దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు: జులై 1, 2023 నాటికి 22 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్ల మినహాయింపు వర్తిస్తుంది.
ఎంపిక: ప్రవేశ పరీక్ష, బృందచర్చ, మౌఖిక పరీక్షలతో సీట్లు కేటాయిస్తారు. ప్రవేశ పరీక్షకు 70 శాతం, గ్రూప్ డిస్కుషన్‌కు 15, ఇంటర్వ్యూకు 15 శాతం వెయిటేజీ ఉంటుంది.

పరీక్ష ఇలా

బీబీఏ, ఎంబీఏ రెండు కోర్సులకూ ప్రవేశ పరీక్ష స్వరూపం ఒకటే. అయితే ప్రశ్నల స్థాయిలో వ్యత్యాసం ఉంటుంది. పరీక్షను వంద మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున వంద ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి 2 గంటలు. ఇందులో జనరల్ అవేర్‌నెస్ 50, వెర్బల్ ఎబిలిటీ 25, క్వాంటిటేటివ్ ఎబిలిటీ 25 ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో వస్తాయి. రుణాత్మక మార్కులు లేవు.
దరఖాస్తులు: మే 31 వరకు స్వీకరిస్తారు.
ఫీజు: ఎస్సీ, ఎస్టీలకు రూ.500. మిగిలిన అందరికీ రూ.1000.
పరీక్ష తేదీ: జూన్ 4, **పరీక్ష కేంద్రాలు:** నెల్లూరు, భువనేశ్వర్, గ్వాలియర్, నోయిడా. **వెబ్‌సైట్:** https://www.iittm.ac.in/index.html

---

తాజా ఇంటర్న్‌షిప్‌లు

హైదరాబాద్‌లో

మార్కెటింగ్

సంస్థ: టన్లా సొల్యూషన్స్
స్టైపెండ్: నెలకు రూ.21,000
దరఖాస్తు గడువు: 9.03.2023
అర్హతలు: డిజిటల్ మార్కెటింగ్, ఈ మెయిల్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్, ఎంఎస్ ఎక్సెల్ నైపుణ్యాలు
internshala.com/i/840bc3

టెలికాలింగ్

సంస్థ: మాక్‌సాఫీ టెక్నాలజీస్
స్టైపెండ్: నెలకు రూ.6,000
దరఖాస్తు గడువు: 9.03.2023
అర్హతలు: ఇంగ్లిష్‌లో మాట్లాడే, రాసే నైపుణ్యాలు
internshala.com/i/993215

పైతాన్ డెవలప్‌మెంట్

సంస్థ: క్రియాస్ టెక్నాలజీ
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: 9.03.2023
అర్హతలు: జావా, నోడ్.జేఎస్, పైతాన్ నైపుణ్యాలు
internshala.com/i/db861e

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: ఓఎస్‌ఓఎస్
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: 9.03.2023
అర్హతలు: ఇంగ్లిష్, ఎంఎస్ ఆఫీస్ నైపుణ్యాలు
internshala.com/i/1bff40

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: అజ్వస ఎడ్యుకేషన్ సర్వీసెస్
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: 9.03.2023
అర్హతలు: బిజినెస్ డెవలప్‌మెంట్ నైపుణ్యాలు, ఆసక్తి ఉన్న విద్యార్థులు
internshala.com/i/1e9792

మా చిరునామా: చదువు,
ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512
edc@eenadu.in

చదువుకు తగిన ఉద్యోగం రాకపోతే?

చాలామంది ఎదుర్కొనే ప్రశ్న ఇది... భారీగా ఫీజు కట్టి, కష్టపడి చదివి, పట్టా పుచ్చుకుని బయటకు వస్తే... తీరా ఆ చదివిన చదువుకు తగిన ఉద్యోగం రాదు! ఒకపక్క ఖాళీగా ఉండలేక ఒత్తిడి, మరోపక్క సరైన ఉద్యోగం కనపడక డీలా. ఇలాంటి సమయాల్లో ఏం చేయొచ్చు? దీన్ని ఎలా ఎదుర్కోవాలి?

మౌఖిక పరీక్షను ఎదుర్కోవడం గురించి మరింత బాగా నేర్చుకోండి. ఎంత చక్కటి అకడమిక్ స్కోరు, రెజ్యూమె ఉన్నా ఇంటర్వ్యూ సరిగ్గా ఇవ్వకపోతే ఉద్యోగం పొందే అవకాశాలు గణనీయంగా పడిపోతాయి. చక్కగా మాట్లాడటం, సరైన బాడీ లాంగ్వేజ్ కలిగి ఉండటం, ఇంటర్వ్యూలో పాటించాల్సిన ఇతర నియమాలు, టిప్స్‌ను తెలుసుకోవడం ద్వారా ఉద్యోగవకాశాలు మెరుగుపడతాయి.

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో నుంచి మనల్ని మనం బయటపడేసుకునేలా చిన్నచిన్న మార్పులు, ప్రయత్నాలు చేస్తూ ఉండాలి. ఏదేమైనా ఒత్తిడికి లోను కాకుండా విజయం సాధించేందుకు ప్రయత్నించాలి.

- ఒక్కసారి రెజ్యూమెను తరచి చూడండి. కేవలం చదువు, ఇతర వివరాల సమాచారంతో బోరింగ్‌గా ఉందా లేక ఆసక్తి కలిగించేలా ఒక్క విషయం అయినా అనిపిస్తోందా అన్నది కంపెనీల కోణం నుంచి ఆలోచించండి. ఎవరైనా మనల్ని ఎందుకు ఉద్యోగంలోకి తీసుకోవాలి అనే ప్రశ్న మనకు మనమే వేసుకుంటే... ఆ సమాధానంలోంచి సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. దానికి తగిన విధంగా రెజ్యూమెను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ ఉండండి. ఇతరులకంటే భిన్నంగా కనిపించేలా ప్రయత్నించండి.
- సంస్థలకు పంపే కవర్ లెటర్స్, ఈ-మెయిల్స్‌ను జాగ్రత్తగా గమనించండి. అవి అవతలివారిని చదివించేలా ఉండాలి. వారి వెబ్‌సైట్‌లో మనం ఏం చూశాం, ఎందుకు సంప్రదించాం, వారికి ఏం చేయగలం అనే విషయాన్ని తెలియజేసేలా క్లుప్తంగా, స్పష్టంగా ఉండాలి. అప్పుడు ఎదుటివ్యక్తి తిరిగి సమాధానం ఇచ్చేందుకు ఎక్కువ ఆస్కారం ఉంటుంది.
- కేవలం దరఖాస్తులు పంపడమే కాకుండా, ఇంకేం చేయవచ్చో ఆలోచించండి. నియామకాలు జరుగుతున్నట్లు ప్రకటించకపోయినా కంపెనీలను సంప్రదించడం, నెట్‌వర్క్ మీటింగ్స్‌కు హాజరుకావడం, అవసరమైతే ఊరు మారడం, ఏదైనా కోర్సు నేర్చుకోవడం... ఏం చేస్తే ఇప్పుడున్న పరిస్థితి మెరుగవుతుందో అంచనా వేయండి.
- కేవలం నిర్దేశించుకున్న ఉద్యోగమే కాకుండా... దానికి అనుబంధంగా ఏదైనా ఫీల్డ్‌లో ఉద్యోగం దొరుకుతుందేమో ప్రయత్నించండి. కొంతకాలం తర్వాత మారే అవకాశం ఉంటుంది కదా! ముందైతే జాబ్ దొరకడం ముఖ్యం.
- జాబ్ మార్కెట్లో ఎన్నో ఓపెనింగ్స్ ఉంటాయి. అందులో మనకు నప్పే వాటిని, మనకు ప్రాధాన్యం దక్కే వాటిని ఎంచుకోవడం కూడా ముఖ్యమే. అప్పుడే ఆ ఉద్యోగం అందుకునే వీలుంటుంది. ప్రొఫైల్‌కు వీలైనంత దగ్గరగా అనిపించిన ఉద్యోగాలకు దరఖాస్తు చేస్తే తిరిగి జవాబు రావడానికి అవకాశాలు ఎక్కువ ఉంటాయి.
- అన్నింటికీ మించి నిరుత్సాహపడొద్దు. ప్రతి ఒక్కరికీ క్యాంపస్‌లలోనే ఉద్యోగాలు వచ్చేయవు. చాలామందికి చదువు పూర్తవ్వడానికీ, ఉద్యోగంలో చేరడానికీ మధ్య ఒక క్లిష్టమైన సంధి దశ ఉంటుంది. ఆ సమయంలో ఎంత ఓపిగ్గా ప్రయత్నిస్తే అంత బాగా కెరియర్‌ను రూపొందించుకున్నవాళ్లం అవుతాం!



నోటిఫికేషన్స్

ప్రవేశాలు

హెచ్‌సీయూలో..

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్ దూర విద్య/ ఆన్‌లైన్ విధానంలో ఏడాది డిప్లొమా ప్రోగ్రాంలలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ● డిప్లొమా ఇన్ లైబ్రరీ ఆటోమేషన్ అండ్ నెట్‌వర్కింగ్ ● డిప్లొమా ఇన్ సైబర్ లాస్ అండ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ● డిప్లొమా ఇన్ కమ్యూనికేటివ్ ఇంగ్లిష్ ● డిప్లొమా ఇన్ క్రిమినల్ జస్టిస్ అండ్ ఫోరెన్సిక్ సైన్స్ ● డిప్లొమా ఇన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఇన్ అగ్రికల్చర్ ● డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ● డిప్లొమా ఇన్ పంచాయత్‌రాజ్ గవర్నెన్స్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ● డిప్లొమా ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ● డిప్లొమా ఇన్ ఇన్స్పెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ● డిప్లొమా ఇన్ కమ్యూనిటీ ఐ హెల్త్ ● డిప్లొమా ఇన్ టెలికాం టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్
అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ.
రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.300.
దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ: 13-03-2023.
వెబ్‌సైట్: https://cdvl.uohyd.ac.in/

ఐఐఎస్‌ఈఆర్ పుణెలో..

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ 2022-2023 విద్యా సంవత్సరానికి రెండేళ్ల ఎంఎస్సీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ క్లైమేట్ సైన్స్, మ్యాథమెటిక్స్.
అర్హత: కనీసం 60% మార్కులతో బీఎస్సీ, బీఈ, బీటెక్‌తో పాటు వ్యాలిడ్ జామ్ 2023/ఎన్‌బీహెచ్‌ఎం 2023 స్కోరు.
ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 24-03-2023.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07-05-2023.
వెబ్‌సైట్: https://www.iiserpune.ac.in/education/admissions

టీఎస్ఐసెట్- 2023

తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023 (టీఎస్ఐసెట్) నోటిఫికేషన్ విడుదలయింది.
అర్హత: ఎంబీఏ కోర్సుకు బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీబీఎం, బీసీఏ, బీఈ, బీటెక్, బీఫార్మసీ; ఎంసీఏ కోర్సుకు బీసీఏ, డిగ్రీ (కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్), బీఎస్సీ, బీకాం, బీఏ(ఇంటర్/ డిగ్రీ స్థాయిలో గణితం చదివి ఉండాలి).
దరఖాస్తు రుసుము: రూ.750 (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు రూ.550).
ఆన్‌లైన్ దరఖాస్తులు: మార్చి 6న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై, మే 6తో ముగుస్తుంది.
పరీక్షల నిర్వహణ: మే 26, 27 తేదీల్లో.
వెబ్‌సైట్: https://icet.tsche.ac.in/

టీఎస్ ఈసెట్-2023

తెలంగాణ స్టేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్ ఈసెట్)-2023 నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ (మ్యాథమేటిక్స్) అభ్యర్థులకు బీఈ/ బీటెక్/ బీఫార్మసీ రెండో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ విధానంలో ప్రవేశాలు కల్పిస్తారు.
రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.900 (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు రూ.500).
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 02-05-2023.
పరీక్ష తేదీ: 20-05-2023.
వెబ్‌సైట్: https://ecet.tsche.ac.in/

టీఎస్ లాసెట్-2023

తెలంగాణ రాష్ట్రంలో మూడు, ఐదేళ్ల లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్ లాసెట్-2023), తెలంగాణ పీజీ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్ పీజీఎల్‌సెట్-2023) నోటిఫికేషన్ విడుదలయింది.
అర్హత: మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులకు ఏదైనా గ్రాడ్యుయేట్ డిగ్రీ; ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుకు ఇంటర్మీడియట్; ఎల్ఎల్ఎం కోర్సుకు ఎల్ఎల్‌బీ లేదా బీఎల్ ఉండాలి.
దరఖాస్తు రుసుము: లాసెట్‌కు రూ.900 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.600); పీజీఎల్‌సెట్‌కు రూ.1100 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.900).
ఆన్‌లైన్ దరఖాస్తు గడువు: 06-04-2023
పరీక్ష తేదీ: 25-05-2023.
వెబ్‌సైట్: https://lawcet.tsche.ac.in/